# మన చౌరాస్తా

తెలుగు దినపత్రిక




సంపుటి : 01 | సంచిక : 94 | ఎడిటర్ : ఉప్పలంచి నరేందర్ | మంగళవారం, 03 మార్చి 2026 | పేజీలు : 4



# ప్రజావాణి అర్జీలను పరిష్కరించాలి

**జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**



**జనగామ, మన చౌరాస్తా :** ప్రజావాణిలో ఇచ్చిన అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని జనగామ కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సూచించారు. సోమవారం జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని ప్రధాన సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో భాగంగా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బెన్ షాలోమ్ లతో కలిసి జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అర్జీదారుల సమస్యల గురించి తెలుసుకుంటూ 86 అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా స్వీకరించిన పలు ఫిర్యాదుల వివరాలిలా ఉన్నాయి.

- జాఫర్గడ్ మండలం తమ్మడపల్లి గ్రామానికి చెందిన లోకిని కిష్టయ్య, తనకు సర్వే నంబర్ 173 లో 7 గుంటలు, 324/బి లో 36 గుంటల భూమి కలదని, తన పేరున పట్టా పాస్ బుక్ జారీ చేసేందుకు దరఖాస్తు చేసుకున్నారు.
- కొడకండ్ల మండలం రంగాపురం గ్రామానికి చెందిన నలమాస నర్సమ్మ, తన భర్త కల్లు గీత కార్మికుడిగా చేస్తూ అనారోగ్యంతో మరణించాడని, తాను ఒంటరి మహిళ అయినందున ఒంటరి మహిళ పింఛను ఇప్పించాలని కోరారు.
- తరిగొప్పుల మండలం అబ్దుల్ నాగారం గ్రామానికి చెందిన బాషబోయిన ఉప్పమ్మ, తన ఇందిరమ్మ ఇంటికి కిచెన్ లో మెట్ల నిర్మాణం గురించి విన్నవిస్తూ అర్జీ చేశారు.
- జాఫర్గడ్ మండలం రఘునాధపల్లె గ్రామానికి చెందిన ఎడ్ల స్వప్న, తనకు ఎకరం 27 గుంటల భూమి కలదని, ఆ భూమిని రికార్డులో తన పేరును నమోదు చేయించగలరని వినతిపత్రం సమర్పించారు.

ఈ ప్రజావాణిలో ఆర్డీఓలు గోపీరాం, వెంకన్న, డీఆర్డీఓ వసంత, జిల్లా పౌరసరఫరాల అధికారిణి సరస్వతి, డీపీఓ అంబికా సోనీ, వివిధ శాఖల సంబంధిత జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.





# పరీక్షకేంద్రాలను పరిశీలించిన కలెక్టర్

**జనగామ, మన చౌరాస్తా :** ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణలో భాగంగా జనగామ పట్టణంలోని ఏబీవీ ప్రైవేట్, ప్రభుత్వ జూనియర్ కాలేజీని సోమవారం జనగామ జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆకస్మికంగా సందర్శించారు. పరీక్షా కేంద్రంలో ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు, హాజరు వివరాలు, సీసీ కెమెరాల పనితీరు, తాగునీరు, వైద్య సదుపాయాల గురించి అడిగి తెలుసుకున్నారు. పరీక్షలు ప్రశాంత వాతావరణంలో ఎలాంటి అంతరాయం లేకుండా నిర్వహించాలని సూచించారు. అలాగే నిబంధనలు కచ్చితంగా పాటించాలని, విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కళాశాల నిర్వాహకులకు ఆదేశించారు. పరీక్షా కేంద్రాల వద్ద భద్రతా ఏర్పాట్లపై కూడా ప్రత్యేకంగా దృష్టి సారించాలని సూచించారు.

## శ్రీపాదరావుకు ఘన నివాళి

జనగామ, మన చౌరాస్తా : దివంగత శాసనసభ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాదరావు జయంతిని సోమవారం కలెక్టరేట్ లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, అదనపు కలెక్టర్ బెన్ షాలోమ్, వివిధ శాఖలకు చెందిన జిల్లా అధికారులు శ్రీపాదరావు చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.



# మోడల్ పాఠశాలను తనిఖీ చేసిన ఎమ్మెల్యే పల్లా

**బచ్చన్నపేట, మన చౌరాస్తా :** బచ్చన్నపేట మండల కేంద్రంలోని మోడల్ పాఠశాలను జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇటీవల విద్యార్థులకు అందించిన ఆహారంలో నాణ్యత లోపించడంతో కొందరు అస్వస్థతకు గురైన నేపథ్యంలో ఈ సందర్శన చేపట్టారు. పాఠశాలలో అందించిన భోజనం కారణంగా కొందరు విద్యార్థులకు ఫుడ్ పాయిజన్ జరిగినట్లు సమాచారం రావడంతో ఆయన వెంటనే పాఠశాలకు చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. మధ్యాహ్న భోజన నాణ్యతపై ప్రిన్సిపాల్, వంట సిబ్బందిని ప్రశ్నించి, ఇకపై విద్యార్థుల ఆరోగ్యానికి హాని కలగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మరలా ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా జాగ్రత్తలు పాటించాలని హెచ్చరించారు. పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులతో ఎమ్మెల్యే మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు.





# ముగిసిన డీసీసీ అధ్యక్షుల శిక్షణ

- **రాహుల్‌గాంధీతో డీసీసీ అధ్యక్షురాలు ధన్వంతి భేటీ**
- **జిల్లా రాజకీయాలపై చర్చ**

**జనగామ, మన చౌరాస్తా :** వికారాబాద్‌లో నిర్వహించిన డీసీసీ అధ్యక్షుల శిక్షణ శిబిరంలో జాతీయ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పాల్గొన్నారు. ఈ శిక్షణ కార్యక్రమంలో రాష్ట్రంలోని వివిధ జిల్లాల డీసీసీ అధ్యక్షులు పాల్గొని పార్టీ బలోపేతంపై విస్తృతంగా చర్చించారు. సమావేశం అనంతరం రాహుల్ గాంధీ జనగామ డీసీసీ అధ్యక్షురాలు ధన్వంతి లక్ష్మీ నారాయణ లకావత్ తో ప్రత్యేకంగా మాట్లాడారు. జిల్లాలో పార్టీని మరింత బలోపేతం చేయడానికి కృషి చేయాలని, అన్ని వర్గాల నాయకులు, కార్యకర్తలను కలుపుకొని ఏకతాటిపైకి తీసుకువచ్చి క్షేత్ర స్థాయిలో చురుకుగా పనిచేయాలని సూచించారు. రాబోయే ప్రతి ఎన్నికల్లో డీసీసీ అధ్యక్షులకు అవసరమైన అన్ని రకాల అధికారాలు కల్పించబడినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ధన్వంతి లక్ష్మీ నారాయణ లకావత్ మాట్లాడుతూ రాహుల్ గాంధీని కలవడం ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషి చేస్తానని, ఆయనను దేశ ప్రధానిగా చూడటమే తన లక్ష్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ ఇంచార్జి మీనాక్షి నటరాజన్ శిక్షణలో పాల్గొన్న డీసీసీ అధ్యక్షులకు సర్టిఫికెట్లు జారీ చేసి, జనగామ జిల్లా డీసీసీ అధ్యక్షురాలు ధన్వంతి లక్ష్మీనారాయణ లకావత్‌ను ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా రాహుల్ గాంధీ టీపీసీసీ సభ్యులు డాక్టర్ లక్ష్మీనారాయణ నాయక్, వారి కుటుంబ సభ్యులతో కాసేపు మాట్లాడారు. కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కేసీ వేణుగోపాల్, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, మంత్రులు, డీసీసీ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.



# మున్సిపల్ చైర్‌పర్సన్ బాలమణికి సన్మానం

**జనగామ, మన చౌరాస్తా :** జనగామ మున్సిపల్ చైర్మన్ ఎన్నికైన కడకంచి బాలమణిని సోమవారం జనగామలో కవులు కళాకారుల ఐక్యవేదిక సన్మానించింది. జనగామ పట్టణంలో కళా, సాహిత్య రంగాల అభివృద్ధి కోసం తమవంతు కృషి చేయాలని ఐక్యవేదిక బాధ్యులు కోరారు. కార్యక్రమంలో ఐక్యవేదిక బాధ్యులు జి.కృష్ణ, పెట్లోజు సోమేశ్వరాచారి, అయిలా సోమనర్సింహాచారి, లగిశెట్టి ప్రభాకర్, పొట్టబత్తిని భాస్కర్, తాళ్లపల్లి లక్ష్మణ్ గౌడ్, చిలుమోజు సాయికిరణ్ పాల్గొన్నారు.

# ముల్కనూర్ మోడల్ స్కూల్ ప్రవేశాలకు దరఖాస్తు గడువు పొడిగింపు

**భీమదేవరపల్లి, మన చౌరాస్తా :** భీమదేవరపల్లి మండలం పరిధిలోని ముల్కనూర్ మోడల్ స్కూల్లో 2026-27 విద్యా సంవత్సరానికి ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకునే చివరి తేదీని మార్చి 10, 2026 వరకు పొడిగించినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ తెలిపారు. ఆరవ తరగతిలో 100 సీట్లకు, అలాగే 7వ తరగతి నుంచి 10వ తరగతి వరకు మిగిలి ఉన్న సీట్లకు అడ్మిషన్ కోసం విద్యార్థులు మార్చి 10లోపు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తులు మీ సేవ కేంద్రాలు లేదా ఇంటర్నెట్ సెంటర్ల ద్వారా సమర్పించవచ్చు. దరఖాస్తు చేసుకునేందుకు అధికారిక వెబ్‌సైట్‌లో లాగిన్ కావాల్సి ఉంటుంది. ప్రవేశ పరీక్షను ఏప్రిల్ 19, 2026న నిర్వహించనున్నారు. మరిన్ని వివరాలకు మోడల్ స్కూల్ కార్యాలయాన్ని సంప్రదించాలని ప్రిన్సిపాల్ సూచించారు.



# రాజ్యసభలో మాదిగలకు అవకాశం కల్పించాలి

- **ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాగళ్ల ఉపేందర్ మాదిగ**

**జనగామ, మన చౌరాస్తా :** తెలంగాణ రాష్ట్రంలో అత్యధిక జనాభా కలిగిన మాదిగ సామాజిక వర్గానికి ప్రస్తుతం భర్తీ కాబోతున్న రాజ్యసభ స్థానాలలో కాంగ్రెస్ మాదిగలకు ఒక స్థానం ఇవ్వాలని, గత లోక్ సభ ఎన్నికల్లో ఒక్క టికెట్ కూడా ఇవ్వకుండా, 5 ఎమ్మెల్సీ స్థానాల్లో కూడా అవకాశం ఇవ్వకుండా మాదిగలకు చేసిన అన్యాయాన్ని ఇప్పటికైనా సరిదిద్దుకోవాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాగళ్ల ఉపేందర్ మాదిగ డిమాండ్ చేశారు. జనగామ జిల్లా కేంద్రంలోనీ విజయ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్రం నుండి మాదిగలకు పార్లమెంట్ లో రాజకీయ ప్రాతినిధ్యం లేకుండా కుట్రలు చేస్తుందని అన్నారు. ప్రస్తుతం తెలంగాణ నుండి పార్లమెంట్‌లో ఓసిలకు, బీసీలకు, ఎస్టీలకు అలాగే ఎస్సీలలో మాలలకు ప్రాతినిధ్యం ఉందని, ప్రాతినిధ్యం లేని కులం మాదిగలు మాత్రమే అని అన్నారు. మాదిగ బిడ్డే ముఖ్యమంత్రిగా ఉన్నాడని అనుకోవాలని మాదిగలకు గొప్పలు చెప్పుకున్న రేవంత్ రెడ్డి ఆచరణలో మాత్రం మాదిగ జాతిపై సవతి ప్రేమను చూపుతున్నారని అన్నారు. మొన్న 5 శాసనమండలి స్థానాలు భర్తీ అయితే అందులో ఒకటి కూడా మాదిగలకు ఇవ్వలేదన్నారు. ప్రస్తుతం భర్తీ అవుతున్న రెండు రాజ్యసభ స్థానాల్లో ఒకటి మాదిగలకు కేటాయించే విధంగా అధిష్టానాన్ని ఒప్పించి న్యాయం చేయాల్సిన బాధ్యత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మీదనే ఉందని అన్నారు. కార్యక్రమానికి ఎమ్మెస్పీ జిల్లా అధ్యక్షులు గద్దల కిషోర్ మాదిగ అధ్యక్షత వహించగా రాష్ట్ర నాయకులు చుంచు రాజు మాదిగ, వీహెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి కుమార్, సోషల్ మీడియా రాష్ట్ర అధ్యక్షులు ఇనుముల అనిల్ మాదిగ, ఎమ్మెస్పీ జిల్లా అధికార ప్రతినిధి సందెన రవీందర్ మాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు పైసా రాజశేఖర్ మాదిగ, ఎమ్మెస్పీ జిల్లా ప్రధాన కార్యదర్శి జేరిపోతుల సుధాకర్ మాదిగ, జిల్లా సీనియర్ నాయకులు నిర్మాల భాస్కర్ మాదిగ తదితరులు పాల్గొన్నారు



# జనగామ అభివృద్ధే లక్ష్యం

- **నూతన కలెక్టర్‌తో ఎమ్మెల్యే పల్లా భేటీ**

**జనగామ, మన చౌరాస్తా :** జనగామ జిల్లా నూతన కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన సందీప్ కుమార్ ఝాను సోమవారం జనగామ ఎమ్మెల్యే డా. పల్లా రాజేశ్వర్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే కలెక్టర్ తో పలు అభివృద్ధి పనులు, సమస్యలపై మాట్లాడారు. ఈ భేటీకి జనగామ మున్సిపాలిటీ పరిధిలోని నూతన కౌన్సిలర్లు, పలువురు ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. సమావేశంలో ఎమ్మెల్యే పల్లా ప్రతి కౌన్సిలర్‌ను కలెక్టర్‌కు వ్యక్తిగతంగా పరిచయం చేస్తూ, వారి వార్డు పరిధిలో ఉన్న ముఖ్య సమస్యలను వివరించారు. ప్రజలతో నిత్యం మమేకమై పని చేస్తున్న ప్రజాప్రతినిధుల అభిప్రాయాలను కూడా కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ.. జనగామ మున్సిపాలిటీని అందమైన, పరిశుభ్రమైన పట్టణంగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో ముందుకు సాగితే అభివృద్ధి మరింత వేగవంతం అవుతుందని పేర్కొన్నారు. అనంతరం కలెక్టర్ సందీప్ కుమార్ ఝా స్పందించి మాట్లాడారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ఎలాంటి ఇబ్బందులు ఉన్నా నేరుగా తనను సంప్రదించాలని ప్రజా ప్రతినిధులకు సూచించారు. ప్రభుత్వం, పరిపాలన సమన్వయంతో పనిచేస్తే అభివృద్ధి లక్ష్యాలను సులభంగా సాధించవచ్చని అన్నారు. జనగామ పట్టణ సుందరీకరణకు, మౌలిక వసతుల అభివృద్ధికి తాను ఎల్లప్పుడూ కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

# కరీంనగర్ కలెక్టరేట్ ముందు వికలాంగుడి ఆవేదన

**కరీంనగర్, మన చౌరాస్తా :** గంగాధర మండలం గర్షకుర్తి గ్రామానికి చెందిన నిరుపేద వికలాంగుడు ఓదెల నరేష్ తన కుటుంబ పరిస్థితి దయనీయంగా మారిందని పేర్కొంటూ జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ముందు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం మరియు సంబంధిత అధికారులు తన సమస్యలను పట్టించుకోవడం లేదని ఆయన ఆరోపించారు. తల్లిదండ్రులు వృద్ధాప్యంలో ఉండటంతో కుటుంబం దిక్కుతోచని స్థితిలో ఉందని,g తాను చదువు పూర్తి చేసి కూడా ఉద్యోగం లేక ఇబ్బందులు పడుతున్నానని నరేష్ తెలిపారు. 2016 నుంచి వికలాంగుల సేవా కార్యక్రమాల్లో పాల్గొంటూ సామాజిక సేవ చేస్తున్నప్పటికీ ప్రభుత్వ నుంచి సరైన సహాయం అందలేదని అన్నారు. తెలంగాణ ఉద్యమంలోనూ తాను చురుకుగా పాల్గొన్నానని, అనేక నిరసన కార్యక్రమాల్లో పాల్గొన్నానని ఆయన పేర్కొన్నారు. వివిధ స్థాయిల ప్రజాప్రతినిధులు, అధికారులు, అలాగే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వరకు తన సమస్యను తెలియజేసినా పరిష్కారం కాలేదని తెలిపారు. తనకు జీవనోపాధి కోసం వేములవాడ రాజన్న దేవస్థానం లేదా ఇతర ప్రభుత్వ విభాగాల్లో అయినా ఉద్యోగావకాశం కల్పించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. తన కుటుంబ పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం వెంటనే స్పందించాలని కోరారు.




# ముల్కనూరు ఎస్సీ బాలికల వసతి గృహంలో నిర్లక్ష్యం

- **వార్డెన్ తొలగించాలని డిమాండ్**



**భీమదేవరపల్లి, మన చౌరాస్తా :** భీమదేవరపల్లి మండలంలోని ముల్కనూరు ఎస్సీ బాలికల వసతి గృహంలో విద్యార్థినుల భద్రతపై నిర్లక్ష్యం కొనసాగుతోందని ఆరోపిస్తూ హాస్టల్ వెల్ఫేర్ అధికారిని విధుల నుంచి తొలగించాలని యుఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షులు ఆకుల మనోజ్ డిమాండ్ చేశారు. ముల్కనూరు వసతి గృహంలో నీటి సౌకర్యం కోసం విద్యార్థినులే రాత్రివేళల్లో విద్యుత్ మోటారు ఆన్ చేయాల్సి వస్తోందని ఆయన తీవ్రంగా ఖండించారు. నీటి సమస్య కారణంగా విద్యార్థినులు స్వయంగా కరెంటు ఫీజులు చెల్లించి మోటారు నడపడం రోజువారీ దినచర్యగా మారిందని తెలిపారు. విద్యార్థినులు తమ ప్రాణాలను లెక్కచేయకుండా ఇలాంటి పనులు చేయాల్సి రావడం అత్యంత దురదృష్టకరమని ఆయన అన్నారు. రాత్రి వేళల్లో వాచ్మెన్ లేదా సంబంధిత సిబ్బంది ఉండాల్సిన చోట విద్యార్థినులే ఈ పనులు చేయడం ఏమిటని ప్రశ్నించారు.అదేవిధంగా హాస్టల్ వార్డెన్ సమయపాలన పాటించడం లేదని, ఉదయం టిఫిన్ సమయాల్లో కూడా హాజరు కాకపోవడం విధినిర్వహణలోపాన్ని సూచిస్తోందని ఆరోపించారు. విద్యార్థులకు ఏవైనా అనుకోని ప్రమాదాలు జరిగితే బాధ్యత ఎవరిది అనే విషయాన్ని అధికారులు గమనించాలని కోరారు. విద్యార్థినుల చేత పనులు చేయించడం, భద్రతా లోపాలు వంటి అంశాలకు బాధ్యులైన వార్డెన్‌ను వెంటనే విధుల నుంచి తొలగించాలని ఆయన డిమాండ్ చేశారు. ఇకపై ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా అధికారులను కోరారు. డిమాండ్లు నెరవేర్చకపోతే జిల్లా కలెక్టరేట్ ముందు ఆందోళన చేపడతామని ఆయన హెచ్చరించారు.



# బాధితులకు నష్ట పరిహారం ఇవ్వాలి

- **కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి బొట్ల శేఖర్**

**జనగామ, మన చౌరాస్తా :** జనగామ జిల్లా కేంద్రంలో జనగామ నుంచి దుద్దేడ వరకు నేషనల్ హైవే జాతీయ రహదారి 365. బి బైపాస్ లో ప్లాట్లు కోల్పోతున్న బాధితులకు నష్టపరిహారం చెల్లించాకే బైపాస్ రోడ్డు పనులు కొనసాగించుకోవాలని బాధితుల పక్షాన కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి బొట్ల శేఖర్, సిఐటియు పట్టణ కార్యదర్శి బూడిద ప్రశాంత్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ‘నిరుపేద కుటుంబాలకు చెందిన బాధితులు కాయకష్టం చేసి భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని వారి పిల్లల గురించి గత పదిహేను సంవత్సరాల క్రితం ప్లాట్లు 470 మంది కొనుగోలు చేసుకున్నారు. ఇప్పుడు ప్రభుత్వం బైపాస్ రోడ్డు వంకతో బాధితులకు నష్టపరిహారం చెల్లించకుండా రోడ్డు పనులు ప్రారంభించారు ఎన్నిసార్లు జనగామ ఆర్డీవో గారికి ఎన్నిసార్లు విన్నవించుకున్న పట్టించుకోకపోవడంతో జనగామ జిల్లా కలెక్టర్ గారికి కూడా విన్నవించుకున్న పట్టించుకోకుండా బాధితులను రోడ్డుపాలు చేస్తా ఉన్నారు..’ అని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి వెంటనే స్పందించి ఇక్కడ ఉన్న 470 కుటుంబాలను ఆదుకోవాలని వారు కోరారు. కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు తుటి దేవదానం, జిల్లా సహాయ కార్యదర్శి మబ్బు ఉప్పలయ్య, సిఐటియు టౌన్ కమిటీ మెంబర్ గచ్చగల వెంకటేష్, గంగరబోయిన మల్లేష్, రాజ్, శివరాత్రి రాజు, బూడిద నవీన్ పాల్గొన్నారు.




# లయన్స్ సేవలు గ్రామీణ ప్రాంతాలకు విస్తరించాలి

- వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు

**జనగామ, మన చౌరాస్తా:** సమాజంలోని అవసరార్థులను ఆదుకునే లయన్స్ క్లబ్బుల సేవలు గ్రామీణ ప్రాంతాలకు విస్తరించాలని వర్ధన్నపేట శాసన సభ్యులు కె.ఆర్. నాగరాజు అన్నారు. ఆదివారం రాత్రి జనగామ భ్రమరాంబ కన్వెన్షన్ హాల్లో జరిగిన సోమేశ్వర రీజియన్ చంద్రగిరి సేవా సమ్మేళనం ప్రాంతీయ మహాసభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. రీజియన్ చైర్మన్ లయన్ చంద్రగిరి శ్రీనివాసు అధ్యక్షతన జరిగిన వేడుకలో ఎమ్మెల్యే మాట్లాడుతూ లయన్స్ క్లబ్బుల సేవా కార్యక్రమాలను అభినందించారు. మెల్విన్ జోన్స్ మహనీయుడు స్థాపించిన ఈ సంస్థ మునుముందు మరింత రాణించే విధంగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ ప్రాంతంలో సేవా కార్యక్రమాలు నిర్వహించి అవార్డులు అందుకున్న క్లబ్బుల సారధులను ఆయన అభినందించారు. క్లబ్ లు చేసిన సేవా కార్యక్రమాలను ప్రదర్శిస్తూ నిర్వహించిన బ్యానర్ ప్రజెంటేషన్ కార్యక్రమం శోభాయమానంగా జరిగింది. ఇందులో ఉత్తమ ప్రజెంటేషన్ గా లయన్స్ క్లబ్ చేర్యాల ఎంపిక కాగా, పాలకుర్తి మేడిపల్లి, ఘటకేశ్వర్ క్లబ్ లకు అవార్డులు లభించాయి. ఈ సందర్భంగా "సాండ్ ఆర్ట్" కళాకారుడు కాంత్ రిసా ఇసుకపై బొమ్మలు వేసి వాటి గురించి వివరించారు. వ్యవస్థాపకుడు మెల్విన్ జోన్స్ సంకల్పం సాకారం అయి అవసరార్థుడైన ప్రక్క వాడికి సహాయపడాలనే సదాశయం విశ్వవ్యాప్తంగా అమలు జరగడం గొప్ప విశేషమని అన్నారు. మనిషిలో స్వార్థం తగ్గితే ఆనందం పెరుగుతుందని అన్నారు. సమాజ సేవ చేస్తున్న లయన్స్ అభినందనీయులని అన్నారు. గౌ. అతిథులుగా పాల్గొన్న పద్మశ్రీ గడ్డం సమ్మయ్య, కాకతీయ హెరిటేజ్ ట్రస్ట్ ఫౌండర్ ప్రొఫెసర్ ఎం. పాండురంగారావు లయన్స్ క్లబ్ ల సేవలను అభినందిస్తూ ప్రసంగించారు. రీజియన్ చైర్మన్ లయన్ ఇంజనీర్ చంద్రగిరి శ్రీనివాస్ మాట్లాడుతూ క్లబ్ ల సేవా కార్యక్రమాలు గుర్తు చేస్తూ ప్రసంగించి ఉత్తములుగా ఎంపికైన లయన్స్ కు అవార్డులు ప్రదానం చేశారు. రీజియన్ చైర్మన్ ను రీజియన్ అడ్వైజర్ లయన్ కన్న పరశురాములు, ముఖ్య అతిథిని పూర్వ జిల్లా గవర్నర్ లయన్ కె. గోవింద రాజు సభకు పరిచయం చేశారు. ఫస్ట్ వైస్ జిల్లా గవర్నర్ లయన్ నరహరి సుధాకర్ రెడ్డి, సెకండ్ వైస్ జిల్లా గవర్నర్ లయన్ పుట్ట హరికిషన్ రెడ్డి, ఎస్.వి.డి. జి అభ్యర్థులు డా. అజిత్ కుమార్, రేవూరి రమణారెడ్డి ప్రసంగించారు. ఈ ప్రాంతానికి చెందిన పూర్వ రీజియన్ చైర్మన్ లను సన్మానించారు. పూర్వ జిల్లా గవర్నర్లు డా. కె. సుధాకర్ రెడ్డి, డా. కె. రాజేందర్ రెడ్డి, డా. డి. లవకుమార్ రెడ్డి, పొట్లపల్లి శ్రీనివాస రావు, కొత్తపల్లి జాన్ బన్నీ, టి. లక్ష్మీ నరసింహా రావు, ముచ్చ రాజిరెడ్డి, గాట్ లీడర్స్ డా. వి. శారద, టి. వెంకట్ రెడ్డి, కుర్రెముల యాదగిరి, కె. సుభాష్, రీజియన్ చైర్మన్ సహచరులు ఎం. పద్మజాదేవి, దుస్స శివశంకర్, వి. రాజేందర్, పొన్నాల సంయుక్త, రామిని శ్రీనివాసులు, రీజియన్ మీట్ ఆర్గనైజింగ్ కమిటీ చైర్మన్ డా. రాజమౌళి, కో చైర్మన్ వై. సంజీవరెడ్డి, కోఆర్డినేటర్లు పి. గోపయ్య, పి. జయహరి, జి. ప్రమోద్ కుమార్, రీజియన్ కార్యదర్శి టి. కృష్ణారెడ్డి, కోశాధికారి కృష్ణ జీవన్ బజాజ్ పాల్గొన్నారు. బెస్ట్ క్లబ్ అవార్డు లయన్స్ క్లబ్ పాలకుర్తి కి లభించగా లయన్ ఆఫ్ ది రీజియన్ గా లయన్ చంద్రగిరి ప్రసాద్ కు లభించాయి. తొలుత రీజియన్ ప్రథమ మహిళ లయన్ చంద్రగిరి కవిత జ్యోతి ప్రజ్వలన చేయగా, డా. నవ్య పతాక వందనం చేశారు. జిల్లా గవర్నర్ లయన్ డా. చంద్రశేఖర్ ఆర్య ప్రారంభోన్యాసం చేసి వేడుకను ప్రారంభించారు, కో చైర్మన్ వై సంజీవరెడ్డి వందన సమర్పణ చేశారు.





# ప్రెస్టన్ భూములపై అసత్య ప్రచారం వద్దు

- మిషన్ ఆస్తులను కాపాడుతున్నది మేమే..
- దామెర జేమ్స్ పై లీగల్ యాక్షన్
- ఏబీఎఫ్ఎంఎస్ ప్రతినిధుల వెల్లడి

**జనగామ, మన చౌరాస్తా :** ప్రెస్టన్ భూములపై కొందరు అసత్య ప్రచారాలు చేస్తున్నారని, వారిపై న్యాయ పోరాటం చేస్తున్నామని అమెరికన్ బాప్టిస్టు ఫారిన్ మిషన్ సొసైటీ (ఏబీఎఫ్ఎంఎస్) ప్రతినిధులు తెలిపారు. ఇటీవల ప్రెస్టన్ పాఠశాలలో జరిగిన విలేకరుల సమావేశంలో డా. కె.ఎం జాన్, దామెర జేమ్స్, బక్క ప్రవీణ్ తదితరులు ఏబీఎఫ్ఎంఎస్పై చేసిన ఆరోపణలను ఆ సంస్థ ప్రతినిధులు తాటికాయల ప్రవీణ్, నల్ల ఆమోస్, నల్ల సుకుమార్, లాజర్ ఎల్మర్ తీవ్రంగా ఖండించారు. సోమవారం పట్టణంలో ఓ ఫంక్షన్ హాల్ నిర్వహించిన మీడియా సమావేశంలో వారు పలు వివరాలు వెల్లడించారు. మిషన్ ఆస్తుల కాపాడేందుకు ఏబీఎఫ్ఎంఎస్ గత 18 ఏళ్లుగా పోరాటం చేస్తోందని స్పష్టం చేశారు. తమ పోరాటంలో భాగంగా ప్రెస్టన్ భూములపై తమకు హక్కు ఉందని 2011లో అనాటి జాయింట్ కలెక్టర్ ఆర్డర్ ఇచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. ఆ తర్వాత కె.ఎం జాన్ తదితరులు ఏబీఎఫ్ఎంఎస్ నుంచి సేల్ జీపీఏ తెచ్చుకున్న విషయం నిజం కాదా ప్రశ్నించారు. ఇందుకు సంబంధించిన అన్ని ఆధారాలు తమ వద్ద ఉన్నాయని తెలిపారు. కానీ ఇప్పుడు కొందరు ఏబీఎఫ్ఎంఎస్ ప్రతిధులమైన తమ కావాలని అసత్య ప్రచారాలు చేస్తున్నారని, వాటిని న్యాయంగా ఎదుర్కొంటామని స్పష్టం చేశారు. మిషన్ ఆస్తులను కాపాడేది ఏబీఎఫ్ఎంఎస్ ఒక్కటే అని తెలిపారు. సమావేశంలో సుధాకర్, ఎం.రాజేశ్, జి.ఇమ్మానుయేల్, ఎన్.డేవిడ్, పి.ప్రభాకర్, ఎం.సత్యపాల్, పి.విలియం, ఆశీర్వాదం, పి.సుధాకర్, జీవరత్నం, జాన్సన్, నల్ల అజయ్ పాల్గొన్నారు.




## స్వపరిపాలన దినోత్సవం

**పాలకుర్తి, మన చౌరాస్తా :** దర్దేపల్లి ఉన్నత పాఠశాలలో స్వపరిపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి సహచర విద్యార్థులకు పాఠాలు బోధించారు. ఈ కార్యక్రమంలో డీఈవోగా గిద్దెల విష్ణువర్ధన్, ఎంఈవో గా దిద్దెల వినయ్, హెచ్ఎంగా గా కట్ట అనూషఉపాధ్యాయులుగా J.అశ్విని, J. విష్ణు, R. శృతి కీర్తి, D. వెన్నెల, ఎ.కుమారస్వామి,శృతి, PET గా జి.మన్షిష్, డీఈవో పీఏగా శ్రీను, ఒఎస్‌గా దాసరి లక్ష్మీ వ్యహరించారు. ఈ కార్య క్రమంలో పాఠశాల హెచ్ఎం వెంకటేశం ఉపాధ్యాయులు శ్రీనివాసు, పాపయ్య, జాన్సీరాణి, ఉప్పలయ్య, సోమ మల్లయ్య, రజిత, సూర్యప్రకాష్, వెంకటనర్సయ్య, నాగజ్యోతిలు పాల్గొన్నారు.

# కబడ్డీ పోటీలలో భీమదేవరపల్లి జట్టుకు ద్వితీయ స్థానం

**భీమదేవరపల్లి, మన చౌరాస్తా :** పీఎం సంసద్ క్రీడామహోత్సవంలో భాగంగా ఈరోజు హుస్నాబాద్ నియోజకవర్గ కేంద్రంలో నిర్వహించిన కబడ్డీ పోటీలలో భీమదేవరపల్లి కబడ్డీ జట్టు విశేష ప్రతిభ కనబరిచి నియోజకవర్గ స్థాయిలో ద్వితీయ స్థానాన్ని సాధించింది. పోటీలలో మొదటి రెండు స్థానాల్లో నిలిచిన జట్లకు తదుపరి దశగా పార్లమెంట్ స్థాయి పోటీలు నిర్వహించనున్నారు. ఈ పోటీలు మార్చి 5 నుండి 7 వరకు కరీంనగర్లో జరగనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.ఈ సందర్భంగా నిర్వాహకుడు మాచర్ల కుమారస్వామి మాట్లాడుతూ, విజేత జట్లు తదుపరి దశలో కూడా ప్రతిభ కనబరిచి ఉన్నత స్థానాలు సాధించాలని ఆకాంక్షించారు. భీమదేవరపల్లి జట్టు సాధించిన విజయంపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.



Printed and Published by **UPPALANCHI POORNIMA** on behalf of UPPALANCHI POORNIMA, Printed at Hamara Warangal Printers and Graphics H.no.25-8-182, Balaji Nagar, Kazipet, Warangal, 506003., Published at H.No.4-8-65, Dharmakancha, Jangaon, Jangaon District. Telangana, 506167, Editor : **UPPALANCHI NARENDER**. Ph : **8555800812**, RNI : **TGTEL/25/A4350**